# మనసును దైవంవైపు త్రిప్పినప్పుడే మనిషికి శాంతి

**సర్వరూపధరం శాంతం సర్వనామ ధరం శివం**
**సచ్చిదానంద మద్వైతం సత్యం శివం సుందరం**

ప్రేమస్వరూపులారా! రెండు దినములనుంచి మీరందరూ ఎంతో శ్రమలకోర్చి ఇక్కడ కూర్చొని, అన్ని విషయములనూ చక్కగా వింటూవచ్చారు. ఎంత దూరము నుంచియో వచ్చి, ఎంతో వ్యయ ప్రయాసల కోర్చి మీరు ఈ సమావేశంలో పాల్గొనటం మీ పవిత్రమైన హృదయానికి సాక్ష్యం. లోకంలో ఉన్న కోట్లాది జనులలో కొద్దిమందికి మాత్రమే ఇట్టి అవకాశం లభిస్తుంది. ఇది చాలా గొప్ప అదృష్టం.

మీరిక్కడికి వచ్చినందుకు ముఖ్యంగా తెలుసుకోవలసిన విషయమేమిటి? లోకంలో కొన్ని లక్షల స్కూల్సు ఉన్నాయి, కొన్ని లక్షల కాలేజీలు ఉన్నాయి. అవి ఎన్ని ఉండినప్పటికీ మీరు మొట్టమొదట మీ హృదయమనే 'కాలేజి'యొక్క స్వభావాన్ని అర్థం చేసుకోవాలి. అందులోనున్న సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింస అనేటటువంటి అయిదు విలువలను అలవరచుకోవాలి. అప్పుడే మీరు నిజమైనటువంటి విద్యావంతులు కాగలరు. లోకంలో ఎంతమందో లాయర్సున్నారు; పెద్దపెద్ద గ్రంథాలు చదువుతున్నారు. కాని, ఎన్ని చదివినప్పటికీ వాళ్ళుకూడను 'లయర్సు' (అసత్యవాదులు)గా తయారైతే ప్రయోజనమేమిటి! ఎంతమందియో డాక్టర్లు ఉంటున్నారు. కాని, ఒక డాక్టరుకు మరొక డాక్టరుకు మధ్య 'యూనిటీ' కనిపించడం లేదు. మొట్టమొదట మీరు సాధించవలసినది 'యూనిటీ'. అందరూ బ్రదర్స్ అండ్ సిస్టర్సే! తండ్రి ఒక్కడే, ఆయనే భగవంతుడు. మనమంతా ఆ తండ్రియొక్క బిడ్డలమే అనేటటువంటి సత్యాన్ని మీరు హృదయంలో స్థిరం చేసుకోవాలి. బిడ్డలలో

sri sathyasai vachanamrutam

చిన్నచిన్న లోపాలు ఉండవచ్చు. ఒకరినొకరు అర్థం చేసికొని 'అడ్జస్ట్' చేసుకోవాలి. 'అండర్‌స్టాండ్' (అర్థం) చేసుకుంటే 'అడ్జస్ట్‌మెంట్' (సర్దుకుపోవడం) సులభ మవుతుంది. స్వామి ఎంతో ప్రేమతో మీ మంచికోసమే ఇవన్నీ బోధిస్తున్నాడు, అనేటటువంటి సత్యాన్ని మీరు మొట్టమొదట గుర్తించండి.

ఈనాడు సైన్సు దినదినాభివృద్ధినొందుతున్నది. కాని, సైంటిస్టులు చేసే పరిశోధనలన్నీ కేవలం 'సెన్సెస్' (ఇంద్రియాల) యొక్క పరిధిలోనివి గనుక, వాటిలో చాలా తప్పులు జరుగుతున్నాయి. ఈనాటి సైంటిస్టులవల్ల సమాజమునకు ఉపకారముకంటె ఎక్కువ అపకారమే జరుగుతున్నది. Help (సహాయం) చేస్తున్నామని అంటున్నారేగాని, నిజానికి ఎన్నో విధాలుగా hurt (అపకారం) చేస్తున్నారు. తత్ఫలితంగా ఈనాటి మానవుడు భయభ్రాంతులతో జీవించవలసి వస్తోంది. ఒక ఏరోప్లేన్ ఎక్కాలంటే భయమే! ఒక చిన్న ఎలుకను చూసినా భయమే! అన్నిటికీ భయమే! ఈ భయంవల్ల అనేకవిధములైన భ్రాంతులు అభివృద్ధి అవుతున్నాయి. కనుక, మనం దేనికీ భయపడకూడదు. కాని, ఇప్పుడు కూరగాయలు తినాలన్నా భయమే! పళ్ళు తినాలన్నా భయమే! వాటివల్ల ఏ జబ్బులు వస్తాయో ఏమిటో! ఎందుకంటే ఇవన్నీ కొన్నివిధములైన మందులతో తయారవుతున్నాయి. మనం తినే తిండి, త్రాగే నీరు, పీల్చే గాలి అన్నీ కలుషితమైపోయినాయి. ఇటువంటి పరిస్థితిలో మన ఆరోగ్యాన్ని ఎట్లా కాపాడుకోగలము? కనుక, మనం ఈ 'పొల్యూషన్' (కాలుష్యం) లేకుండా చేసుకోవాలి. రుచికోసమని తినరాని పదార్థాలు తిని ఆరోగ్యాన్ని పాడు చేసుకోకూడదు. మీరు ఆరోగ్యాన్ని కాపాడుకుంటే మీకు ఆరోగ్యవంతులైన బిడ్డలు పుడతారు. పిల్లలకు శారీరక ఆరోగ్యంతోపాటు మానసిక వికాసాన్ని అందించే నిమిత్తం వారిని బాలవికాస్‌లో చేర్చి సద్బోధలు చేయాలి.

**శాంతి కావాలంటే సత్యాన్ని అనుసరించాలి**

ఎటువంటి పరిస్థితియందైనా సత్యాన్నే పలకండి. అంతేకాదు, మిమ్మల్ని ఎవరేమని నిందించినా మీరు శాంతంగా ఉండండి. పూర్వం ఋషులంతా మౌనం పాటించేవారు. సాధన ఫలవంతం కావడానికి మౌనం చాలా దోహదపడుతుంది. సత్యాన్ని

sri sathyasai vahamrutam

అనుసరించినప్పుడే మనకు శాంతి చేకూరుతుంది. అందులోనుంచి పవిత్రమైన ప్రేమ ఆవిర్భవిస్తుంది. ఎప్పుడు మనలో ప్రేమ ఆవిర్భవిస్తుందో అప్పుడు మనకు శత్రువులే ఉండరు. నిజానికి మనం ఎవరినీ శత్రువులుగా భావించకూడదు. అందరిపట్ల ప్రేమతో జీవించడానికి ప్రయత్నించాలి. లోకశాంతికి ప్రేమ ఒక్కటే మార్గం. ఈనాడు అందరూ 'పీస్, పీస్' (Peace, Peace) అని అంటున్నారుకాని, ఎక్కడా 'పీస్' లేదు; అంతా 'పీసెస్, పీసెస్' (Pieces, Pieces)! అన్నింటినీ ముక్కలు చేస్తున్నారు. దేశాన్నికూడా ముక్కలు చేస్తున్నారు. నీవు విదేశాలకు వెళ్ళినప్పుడు "ఎక్కడినుండి వచ్చావు?" అని ఎవరైనా నిన్ను అడిగితే నీవు విశాలమైన భావంతో "నేను ఇండియానుంచి వచ్చాను" అని చెప్పాలి. అంతేగాని, సంకుచితమైన భావంతో నీ గ్రామం పేరు, జిల్లా పేరు ఇవన్నీ చెప్పుకుంటూ పోకూడదు. విశాలమైన భావాలతో మనం జీవించాలి. అటువంటి భావాలు కలుగడం చాలా అదృష్టం.

మనలో విశాలమైన భావాలను పెంచుకున్నప్పుడు పిల్లలలోకూడను విశాలమైన భావాలు అభివృద్ధి అవుతాయి. తల్లిదండ్రులు ఎటువంటివారో పిల్లలు అటువంటివారుగా తయారవుతారు. కనుక, పిల్లలు మంచివారు కావాలంటే, అభివృద్ధికి రావాలంటే మొట్టమొదట తల్లిదండ్రులు సక్రమమైన మార్గాన్ని అనుసరించాలి; లేకపోతే కొంత వయస్సు వచ్చిన తరువాత పిల్లలు తల్లిదండ్రుల మాట వినరు. పిల్లలు సరిగా లేరంటే అది తల్లిదండ్రులయొక్క దోషమే! తల్లిదండ్రులమధ్య అభిప్రాయ భేదాలు ఉండకూడదు. ఇద్దరూ ఏకంగా ఉండాలి, ఇద్దరూ చేరి ఒకే మాట మాట్లాడాలి. తల్లి ఒకటి చెపితే తండ్రి మరొకటి చెప్పటం మంచిదికాదు.

పిల్లలకు మొట్టమొదట సత్యాన్ని అనుసరించవలసిందిగా బోధించాలి. సత్యం ఒక్కటి ఉంటే చాలు; అదే అన్నిటికీ ఆధారం. "సత్యాన్నాస్తి పరో ధర్మః" సత్యమునుంచి ధర్మము పుడుతుంది. ధర్మమునుంచి శాంతి పుడుతుంది. శాంతినుంచి ప్రేమ పుడుతుంది. అప్పుడు అందరూ అహింసను పాటిస్తూ ప్రశాంతంగా ఉంటారు. కనుక, దేశానికి శాంతి కావాలనుకుంటే, మనం సత్యాన్ని అనుసరించాలి. సత్యమంటే ఏమిటి? 'మనస్యేకం వచస్యేకం కర్మణ్యేకం మహాత్మనాం'. మనసులో ఒకటి పెట్టుకొని, మాట మరొకటి చెప్పి,

srisathyasaivachanamrutam

క్రియ ఇంకొకటి చేస్తే, అది అసత్యమవుతుంది. మీరు అటువంటి 'ఆర్టిఫిషియల్ లైఫ్' (కృత్రిమమైన జీవితం) గడిపితే చాలా చెడిపోతారు. మీ 'హార్టు' (హృదయం)లో ప్రేమను నింపుకోవాలి. మీరు ఏది చేసినా హృదయ పూర్వకంగా చేయాలి. కాని, ఇప్పుడన్నీ 'ఆర్టిఫిషియల్' అయిపోతున్నాయి; చదువుకూడను 'ఆర్టిఫిషియల్'గా మారిపోతున్నది. ఎన్ని గ్రంథాలు చదివినా, ఎన్ని మంత్రాలు ఉచ్చరించినా, ఎంతసేపు ధ్యానం చేసినా అంతా 'ఆర్టిఫిషియలే'! 'ఆర్టిఫిషియలే'! ఇది మంచిది కాదు. మీరు ధ్యానం చేస్తున్నామని కళ్ళు మూసుకుంటారు. కాని, మీ మనస్సు ఇష్టమొచ్చినట్లు తిరుగుతూ ఉంటుంది. ఏమి ప్రయోజనం? కనుక, మొట్టమొదట మీ మనస్సును కంట్రోలు చేసుకోవాలి.

**మనస్సును దైవంవైపు త్రిప్పితే మాయ అణిగిపోతుంది**

మన ఆలోచనలు ఎలాంటివో మన ఆచరణ అలాంటిదవుతుంది. కనుక, మొట్టమొదట మన ఆలోచనలను పవిత్రమైనవిగా పెట్టుకోవాలి. అప్పుడే సత్కర్మలను ఆచరించగలుగుతాము. సత్కర్మలను ఆచరించినప్పుడే మనకు సత్ఫలితాలు వస్తాయి. మనస్సు ఎక్కడెక్కడికో పోతూ ఉంటే దానివెంట మనం పోకూడదు. మనస్సు మన స్వాధీనంలో ఉండాలిగాని, మనం మనస్సుయొక్క అధీనంలో ఉండకూడదు. మనస్సు ఒక mad monkey (పిచ్చికోతి) వంటిది! అది ఇష్టమొచ్చినట్లు ఎగురుతూ ఉంటుంది. కాని, దానిని దైవంవైపు మరల్చినప్పుడు అది చాలా quiet గా అణిగిమణిగి ఉంటుంది.

మీరు సూర్యునికి విరుద్ధంగా తిరిగినప్పుడు సూర్యుని లైటు మీ వీపుపై పడుతుంది. అప్పుడు మీ 'షాడో' (నీడ) మీకంటే పెద్దదిగా ఉండి మీ ముందుకు పడుతుంది. మీరు సూర్యునివైపుకు తిరిగినప్పుడు మీ నీడ మీ వెనుకకు పడిపోతుంది. మాయను మీ నీడతో పోల్చవచ్చును. మీ మనస్సును భగవంతుని వైపుకు త్రిప్పితే మాయ మీ వెనుకకు పడిపోతుంది. అట్లుగాకుండా మీ మనస్సు భగవంతునికి విరుద్ధంగా తిరిగితే మాయ మిమ్మల్ని లోంగదీసుకుంటుంది. మధ్యాహ్నంవేళ సూర్యుడు మీ తలపైకి వచ్చినప్పుడు మీ నీడ మీ పాదాలక్రింద పడిపోతుంది కదా! అదేవిధంగా, మీ మనస్సును స్థిరంగా భగవంతునిపై నిలిపినప్పుడు మాయ పూర్తిగా అణిగిపోతుంది. కనుక, మాయను జయించా

sri sathyasai vachanamrutam

లంటే మీరు మొట్టమొదట మీ మనస్సును భగవంతునివైపు మరల్చాలి.

గడియారంలో మూడు ముళ్లుంటాయి; ఒకటి బిరబిరా 'క్విక్' (quick) గా తిరుగుతూ ఉంటుంది. అదే సెకెన్ల ముల్లు. అరవై సెకెన్లు అయినప్పుడు ఒక నిమిషం అవుతుంది. అరవై నిమిషాలు అయినప్పుడు ఒక గంట అవుతుంది. అయితే, మనం గంటల ముల్లుకే ప్రాధాన్యత ఇస్తాముగాని, సెకెన్ల ముల్లును పట్టించుకోము. సెకెన్ల ముల్లు స్పీడుగా తిరుగుతూ ఉన్నప్పటికీ దానికి మనం విలువ ఇవ్వము. అదేవిధంగా మీరు ప్రొద్దున్న, సాయంకాలం ఏదో కొద్దిసేపు మాత్రమే భగవంతుణ్ని తలుచుకుంటే దానికి అంతగా విలువ ఉండదు. సర్వదా సర్వకాలేషు సర్వత్రా భగవంతుణ్ని స్మరిస్తూ ఉండాలి. అదే గంటల ముల్లు వలె చాలా ముఖ్యమైనది.

'మనయేవ మనుష్యాణాం కారణం బంధ మోక్షయోః' మనస్సే బంధన తెప్పిస్తుంది. ఆ మనస్సే మనకు మోక్షము నందిస్తుంది. కనుక, మనస్సును మీరు సరియైనరీతిలో పెట్టుకోవాలి. అప్పుడు మీకు తప్పకుండా ఏకాగ్రత కుదురుతుంది. సత్యముచేతను, ప్రేమచేతను మనస్సును పవిత్రం గావించుకోవాలి. ఎందుకంటే ఈ రెండే శాశ్వతమైనవి. ప్రేమయే సత్యము. కాబట్టి, ప్రేమలో జీవించండి. ప్రేమ అంటే 'స్పిరిచువల్ లవ్' (ఆధ్యాత్మిక ప్రేమ). దానిని భద్రంగా పెట్టుకున్నప్పుడే మనస్సుకు స్థిరత్వం కలుగుతుంది. లౌకికమైన ప్రేమ ప్రేమ కాదు. అది మనస్సును నిరంతరం చలింపజేస్తూ ఉంటుంది. కనుక, మీరు మీ మనస్సును నిరంతరం భగవంతునివైపుకే త్రిప్పి ఉంచండి. అప్పుడు మీకు ఎంతైనా శాంతి చిక్కుతుంది. ఇది చాలా కష్టమని చాలామంది అనుకుంటారు. కాని, అంతకంటె సులభమైనది మరొకటి లేదు. మనస్సు భగవంతునిపై లేనప్పుడు అది ఏమాత్రం కంట్రోలు కాదు. మీలో నిజంగా భగవత్ప్రేమ అభివృద్ధి అయితే మీ మనస్సు సులభంగా కంట్రోలు అవుతుంది. మీరు ఏది చేసినా, ఏది చూసినా, ఏది చెప్పినా 'ఇదంతా భగవంతునియొక్క పనియే' అనుకోవాలి. ఏది జరిగినా 'ఇదంతా భగవత్సంకల్పమే!' అనుకోవాలి. మంచి జరిగినా అది భగవత్సంకల్పమే; చెడు జరిగినా అది భగవత్సంకల్పమే! ఆ చెడుకూడా ఎందుకోసం ఇచ్చాడో ఏమో! "సుఖదుఃఖే సమేకృత్వా లాభా లాభౌ జయా జయౌ" అన్నట్లుగా, మీరు అన్నిటినీ సమచిత్తంతో, భగవత్ప్రేమతో అనుభవించాలి. ఆ

srisatyasaivachanamrutam

'డివైన్ లవ్' ను అనుసరించినప్పుడు మీకు అన్నీ సక్రమంగా జరిగిపోతాయి.

**భగవత్ప్రేమను మీలో భద్రంగా పెట్టుకోండి!**

ఈనాడు ప్రతి ఒక్కరూ worldly love (లౌకిక ప్రేమ)ను అనుసరిస్తున్నారు. భగవత్ప్రేమయే నిజమైన ప్రేమ. ఆ ప్రేమ ఎన్నడూ మీకు ద్రోహం చేయదు. ఎవరేమని అనుకున్నా, ఏవిధమైన విమర్శలు చేసినా పట్టించుకోకుండా మీలో ఆ 'డివైన్ లవ్'ను భద్రంగా పెట్టుకున్నప్పుడు మీరు భవిష్యత్తులో మంచి అభివృద్ధికి వస్తారు. మీ దేహం ఒక బ్యాగువంటిది. ఇందులో మనస్సు, బుద్ధి, చిత్తము మొదలైనవాటిని పెట్టుకున్నారు. దేహంనుండి ప్రాణం పోతూనే ఇది ఖాళీ తిత్తి అయిపోతుంది. అప్పుడు దీనిని అగ్నిలో వేసి కాల్చివేస్తారు. కాబట్టి, ప్రాణం ఉండగానే మీలో ఉన్నటువంటి సరుకును భగవంతునికి అర్పితం చేయండి. కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యాలు మనకు బాధలు కల్గించేటటువంటివేగాని, ఆనందాన్ని అందించేవి కావు. వీటిని త్యజిస్తే ఎంత హాయిగా ఉంటారు మీరు! అప్పుడు మీలో నిలిచి ఉండేది ఆనందమొక్కటే! అట్టి శాశ్వతమైన ఆనందాన్ని మీరు అనుభవించాలనుకుంటే, మీలో ఉన్నటువంటిదంతా భగవంతునికి అర్పితం చేయాలి. మీరు ఎన్నో కావాలని ఆశపడతారు. కాని, ఆశించినవన్నీ లభిస్తాయా? మీ ఆశలను నెరవేర్చుకునే నిమిత్తం ఇతరులను బాధపెట్టకూడదు. మీకేమైనా కావాలనుకుంటే నేరుగా భగవంతుణ్ని అడగండి. భగవంతునితో మీరు 'డైరెక్టు'గా సంబంధం పెట్టుకోండి! భగవంతుణ్ని 'డైరెక్టు'గా అడుగకుండా లేనిపోని 'ఇన్‌డైరెక్టు' మార్గాలను అనుసరిస్తే మీరు దుఃఖానికి గురికావలసి వస్తుంది.

**ప్రేమ ఒక్కటే అందరినీ ఏకం గావించగలదు**

ఈనాడు మనకు ముఖ్యంగా కావలసింది 'యూనిటీ'. ఆనాడు ప్రజలందరూ ఐకమత్యంతో పోరాడటంచేతనే భారతదేశం స్వాతంత్ర్యం సాధించగలిగింది. దీనిని పురస్కరించుకొని నేను ఆరోజుల్లో ఒక పాట రాశాను. ఒకనాడు ఒక రాజకీయ నాయకుడు వచ్చి, "బాబూ! నీవు మంచి కవిత్వం రాస్తావట. మన వీరులపైన ఒక మంచి పాట రాసిస్తే మేము పేపర్లో వేసుకుంటాం", అని అన్నాడు. వాళ్ళు ఒక సభ ఏర్పాటు చేసుకున్నారు. ఆ

sri sathyasai vachanamrutam

సభలో నేను వేదికమీద ఉయ్యాల తొట్టెలో ఒక రబ్బరుబొమ్మను పెట్టి ఊపుతూ ఇలా ఒక పాటను కూర్చి పాడాను:

**ఏడువకు పసిబాల ఏడువకు తండ్రీ!**
**ఏడిస్తే నిను భరతవీరుడనరయ్యా...జో...జో...**
**హంతకుడు హిట్లరు అమర రష్యాపై**
**దండెత్తి వచ్చెనని జడిసి ఏడ్చితివా...జో...జో...**
**హిట్లరును చంపుటకు ఎర్రసైన్యంబు**
**వీరుడౌ స్టాలిను కలరు ఏడువకు...జో...జో...**
**ఇంకెందుకుర నాన్న అట్టులేడ్చెదవు**
**ప్రజలకైక్యత లేదటంచు ఏడ్చితివా**
**ఐక్యతగ ప్రజలంత చేరి పోరాడి**
**స్వాతంత్ర్యమును పొందగలరు ఏడువకు ...జో... జో...**

అందరూ ఏకం కావడంచేతనే దేశానికి 'ఇన్డిపెన్డెన్స్' (స్వాతంత్ర్యం) వచ్చింది. ప్రేమ ఒక్కటే అందరినీ ఏకం చేస్తుందిగాని, ద్వేషం ఎన్నటికీ చేయదు. చూడండి, ఈనాడు ఇక్కడ మీరందరూ చేరారు. మీ అందరికీ ఎవరైనా ఇన్విటేషన్ పంపించారా? లేదు, లేదు. ప్రేమ ఒక్కటే మీ అందరినీ ఇక్కడికి రప్పించింది. మీ ప్రేమ, నా ప్రేమ రెండూ చేరడంచేతనే మీరు ఇంతటి ఆనందాన్ని అనుభవించ గలుగుతున్నారు. ప్రేమచేత ఎంతటి ఘనకార్యమునైనా సాధించవచ్చును; ఎట్టి రాక్షసుడినైనా జయించవచ్చును. హనుమంతుడు లంకకు వెళ్లినప్పుడు సీత అశోకవనంలో ఒక వృక్షము క్రింద తలవంచుకొని కూర్చొని రామనామాన్ని జపిస్తున్నది. రాముడు తప్పకుండా వచ్చి తనను రక్షిస్తాడని ఆమె పరిపూర్ణంగా విశ్వసించింది; రాముడే తన సర్వస్వంగా భావించింది. భగవంతునిపట్ల మీరు అంతటి పరిపూర్ణమైన ప్రేమను, విశ్వాసాన్ని కలిగి యుండాలి. రావణుడుకూడా గొప్ప విద్యావంతుడే! కాని, రాముని ముందు చిల్లిగవ్వకుకూడా సరిపోలడు. ఎందుకంటే, రాముడు శీలసంపన్నుడు. ఆ 'కేరక్టర్' (శీలము) అనేది ఒకటుంటే ఎంతైనా సాధించవచ్చు. అందువల్లనే మా పిల్లలకు చెబుతుంటాను, శీలమే విద్య పరమావధి. శీలమే లేకపోతే ఎన్ని

sri sathyasai vahanamrutam

చదువులు చదివినను ప్రయోజనం లేదు. చదవటం గొప్పతనం కాదు; మన హృదయంలో సద్గుణాలను ప్రతిష్ఠించుకోవాలి. మన కేరక్టరు కరెక్టుగా ఉన్నప్పుడు అన్నిటియందు విజయం సాధిస్తాము.

కనుక, ప్రేమస్వరూపులారా! మీరు మీ ఇళ్ళకు తిరిగి వెళ్ళిన తరువాత మీ పిల్లలలో మంచి 'కేరక్టర్'ను అభివృద్ధిపరుస్తూ, పవిత్రమైన కార్యాలు చేస్తూరండి! ఎంత డబ్బు సంపాదించి ఏ బ్యాంకులో పెట్టినప్పటికీ చిట్టచివరికి మీవెంట ఏమీ రాదు. కనుక, త్యాగానికి పూనుకోండి! పదిమంది బీదలకు సహాయం చేయండి. త్యాగభావముతో పవిత్రమైన కార్యాలు చేస్తూ మీ జీవితాలను గడిపితే మీరు ఎంతైనా ధన్యులవుతారు.

**– తేదీ 22.7.2008, శ్రీ సత్యసాయి ప్రపంచ విద్యా సమ్మేళనం, సాయికుల్వంత్ సభామండపం**

sri sathyasai vachanamrutam